క్లుప్తంగా

ఈవీఎంపై అవగాహన



బ్రాహ్మణకొట్కూరులో ఈవీఎంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో అధికారులు సోమవారం ప్రజలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్, ఓటరు నమోదు పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వీఆర్వో నర్సరాజు ఆధ్వర్యంలో గ్రామంలోని 24, 25, 26, 27, 28 వార్డుల పరిధిలోని ప్రజలతో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్‌పై ఓటు వేయించి వీవీప్యాట్‌లు, సీయూల పనితీరును వివరించారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు కళ్యాణి, విజయరాణి, మాధవి, వీపీఏలు తదితరులు పాల్గొన్నారు.

ఈ- క్రాప్ నమోదు చేయించుకోవాలి

పగిడ్యాల: రబీ సీజన్‌లో సాగు చేసిన వివిధ పంటలను రైతులు ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఏఓ విజయ్‌జ్యోతుకుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని పది గ్రామ సచివాలయాల పరిధిలో బావులు, బోర్లు, మెట్ట భూముల్లో సాగు చేసిన శనగ, మినుము, జొన్న, మొక్కజొన్న, వేరుశనగ, ఉల్లి, మిరప, నువ్వులు, టమోట తదితర పంటల వివరాలను పట్టాదారు రైతులు గ్రామ వ్యవసాయ అసిస్టెంట్‌ల ద్వారా ఈ -క్రాప్ చేయించుకోవాలన్నారు. రబీ సీజన్ ముగిసేలోగా రైతాంగం పంట నమోదు చేసుకోవాలని ఏఓ వెల్లడించారు.

దుకాణాలపై చర్యలు తీసుకోవాలి

నందికొట్కూరు రూరల్: పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్న స్వీట్ షాపులు, ఫాస్టుఫుడ్ సెంటర్లు, చికెన్, మటన్ దుకాణాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ పార్టీ మండల అధ్యక్షుడు మద్రి స్వామి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గా వారు మాట్లాడుతూ పట్టణంలో వ్యాపారాలు నిర్వహించే దుకాణాదారులు కనీసం పరిశుభ్రతను పాటించకుండా విక్రయించడం వల్ల ప్రజలు అనారోగాల పాలవుతున్నారన్నారు. అనంతరం వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ కిషోర్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగార్జున, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

నందికొట్కూరు రూరల్: గ్రామీణ ప్రాంతాలలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కోనేటమ్మపల్లె గ్రామంలోని ఎస్.సీ కాలనీలో ఎంపీపీ నిధులతో జీఎల్‌ఎస్‌ఆర్ ట్యాంకు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గ్రామాల లో ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.అదేవిధంగా మండల పరిధిలోని నాగటూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎంపీపీ నిధులతో డ్రైనేజీ నిర్మాణానికి గ్రామ నాయకులు, అధికారులు భూమిపూజ చేశారు.

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో ప్రతిభ



తరుణ్‌బాయిని అభినందిస్తున్న హెచ్‌ఎం

నందికొట్కూరు: రాష్ట్రస్థాయి త్రో బాల్ పోటీలలో సత్తా చాటిన జే. తరుణ్‌బాయిని ఆదర్శం తీసుకోవాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కృష్ణమూర్తి అన్నారు. సోమవారం పాములపాడు మండల పరిధిలోని వేంపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో తరుణ్‌బాయిని హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. నంద్యాల జిల్లా కేంద్రంలోని కేవీఎస్‌ఎం మున్సిపల్ హైస్కూల్‌లో ఈ నెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరిగిన 67వ స్కూల్ గేమ్స్ అండర్-17 బాలికల విభాగం త్రో బాల్ పోటీలలో తమ విద్యార్థిని జే. తరుణ్‌బాయి అత్యంత ప్రతిభ కనబరిచింది.

చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు సహకరించండి

నందికొట్కూరు: చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇప్పించాలని ప్రజా సంఘాల నాయకులు అబ్రహం, అంకన్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్‌ను కోరారు. సోమవారం పాములపాడు మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. చాకలి ఐలమ్మ పేద బడుగు బలహీన వర్గాల బానిస సంకెళ్ల నుంచి విముక్తి కోసం సాయుధ పోరాటం చేసినట్లు గుర్తు చేశారు. మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వీరి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు రమణారెడ్డి, ముర్తుజావలి, శివ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.



నందికొట్కూరులో ఆరోగ్య శ్రీ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, అధికారులు



ఆత్మకూరులో పోస్టర్‌విడుదల చేస్తున్న ఎంపీడీఓ, వైద్య సిబ్బంది



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



జూపాడుబంగ్లాలో ఆరోగ్యశ్రీ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

- స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- రూ.25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ కింద వైద్య చికిత్సలు
- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



ఆరోగ్యశ్రీ కార్డు బ్రోచర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందికొట్కూరు: వైద్యరంగంలో విప్లవాత్మక మార్పు లు తెచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ స్పష్టం చేశారు. సోమవారం పాములపాడు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్ స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ వర్చువల్ నిర్వహించిన కార్యక్రమానికి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆరోగ్యశ్రీ కార్డుల బ్రోచర్లను ఎమ్మెల్యే విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద పేదలకు రూ.25 లక్షల వరకు వైద్య చికిత్సలు వైఎస్సార్‌సీపీ ప్రభు త్వం అందిస్తుందన్నారు. ఆరోగ్యశ్రీ కింద చికిత్సల వ్యయ పరిమితి పెంచడంతో పేదల ఆరోగ్యానికి ఎంతో భరోసా కల్పించినట్లుయ్యిందని చెప్పారు. కొత్త ఫీచర్లతో కూడిన ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీతో పాటు ప్రతి ఇంటిలో ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేసే బాధ్యత వైద్య బృందం తీసుకుంటుందని తెలిపారు. క్యాన్సర్ వ్యాధిని కూడా ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చి ఎంత ఖర్చయినా భరించి ఉచిత చికిత్సలు అందించి సీఎం జగనన్న ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని గుర్తు చేశారు.

ప్రజల ముంగిటకే వైద్య సేవలు

జగనన్న ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ప్రజల ముంగిటకే వైద్య సేవలు అందిస్తోందని ఎమ్మెల్యే అన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్యశ్రీపై ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. ఆరోగ్యశ్రీ సేవలపై అవగాహన కల్పించాల్సి బాధ్యత అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. పేద, మధ్య, తరగతి ప్రజలకు మెరుగైన ఉచిత కార్పొరేట్ వైద్యం పేదల ప్రాణాలకు జీవం పోషిన సీఎం వైఎస్ జగనన్న చరిత్రలో నిలిచారన్నారు. అనంతరం ఐకేపీ కార్యాలయంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే ఆర్థర్ పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సరోజినీ వర్ణీనీయ, ఎంపీడీఓ గోపాలకృష్ణ, తహసీల్దార్ రత్నరాధిక, వైద్యులు నాగలక్ష్మిదేవి, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, ఈఓఆర్డీ శ్రీనివాసులు, ఎంపీటీసీలు రజియా సుల్తానా, బషీర్ అహమ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు రమణారెడ్డి, బాలీశ్వరరెడ్డి, రామలింగారెడ్డి, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీ పరిమితి పెంపుతో పేదలకు మేలు

నందికొట్కూరు రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న పేద ప్రజలకు అండగా నిలిచేందుకు ఆరోగ్య శ్రీ పరిమితిని రూ. 25లక్షలకు పెంచినట్లు మండల ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి తెలిపారు. సోమ వారం తహసీల్దార్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ కిషోర్, ఎంపీడీవో శోభారాణితో కలిసి ఆరో గ్య శ్రీకి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆరోగ్య శ్రీతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ సోమేశ్వరి, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ఆత్మకూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్, వైద్య సిబ్బంది పవన్‌కుమార్, గోపాల్ అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఆరోగ్యశ్రీ బ్రోచర్‌ను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.25 లక్షలు వరకు వివిధ చికిత్సలు కార్పొరేట్ వైద్యశాలలో చేయించుకునేందుకు ముఖ్యమంత్రి అనుమతులు మంజూరు చేశారన్నారు. గ్రామాల్లో కార్డులు పంపిణీ చేస్తారన్నారు.

ప్రతిపేదవానికి కార్పొరేట్ వైద్యం

జూపాడుబంగ్లా: ప్రతి పేదవానికి కార్పొరేట్ వైద్యం అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ నూర్జహాన్, వైద్యులు డాక్టర్ యశశ్విని, డాక్టర్ సభా అన్నారు. సోమవారం జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆరోగ్యశ్రీ పథకం బ్రోచర్లను ఆవిష్కరించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యా, వైద్యానికి ఎంతో ప్రాముఖ్యత ఇస్తున్నారన్నారు. ఆరోగ్య శ్రీలో 2,500రకాల వ్యాధులకు ఉచితంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో రూ.25లక్షల వరకు వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వహాబ్, ఈఓపీఆర్డీ మధుమోహన చక్రవర్తి, సూపర్‌వైజర్ రాముడు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నతోనే అభివృద్ధి



80బన్నూరులో సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ, నూనెపల్లె ఎల్లారెడ్డి

జూపాడుబంగ్లా: జగనన్నతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ సువర్ణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు నూనెపల్లె ఎల్లారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని 80బన్నూరు గ్రామంలో రూ.6లక్షల మండల పరిషత్ నిధులతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలోని రజకవీధి, చెంచుకాలనీ, శివాలయం వీధి పక్కన సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. వైఎస్సార్సీపీ పాలనలో అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలివ్వడంతో పాటు గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. సీఎం జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలు దృష్టిలో పె ట్టుకొని ఆయనను మరోమారు ఆశీర్వదించాలని కోరారు. సచివాలయ కన్వీనర్ సాంబశివుడు, రాజేష్, అంజి, శ్రీను, సామే లు, బాలు, తెలుగు శ్రీను, లక్ష్మణ్ పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

నందికొట్కూరు: పట్టణానికి చెందిన విద్యార్థిని శ్రావణి అదృశ్యమైనట్లు టౌన్ ఎస్ఐ హుసేన్‌బాషా సోమవారం తెలిపారు. శ్రావణి పట్టణంలోని ఓ ప్రైవేటు కాలేజీలో డిగ్రీ చదువుతోంది. ఎప్పటిలాగే ఈ నెల 13న కాలేజీకి వెళ్లి తిరిగిరాకపోవడంతో తండ్రి శివయ్య బంధువులు, తెలిసిన వారి వద్ద విచారించినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రతి అర్జీని పరిష్కరిస్తాం

కొత్తపల్లి: స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీ ని పరిష్కరిస్తామని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయ క్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం గ్రామాలలో ప్రతి సమస్యను రూపుమాపేందుకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. స్పందన కార్యక్రమంలో దుద్యాల గ్రామం నుంచి 2, పాతమాడుగుల గ్రామం నుంచి 1 పొలం సర్వే చేయించాలని రైతులు అర్జీలు ఇచ్చారని, వాటిని త్వరగా పరిష్కారిస్తామన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి షష్టి పూజలు





కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ, అర్చకులు,హోమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలాలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి షష్టిని పురస్కరించుకుని సోమవారం మహోత్సవం నిర్వహించారు. ఉత్సవం సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామికి విశేష అభిషేకం, అర్చనలను ఈఓ డి పెద్దిరాజు, అర్చకులు నిర్వహించారు. ఈ పూజాధికాలకు ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతి పూజ నిర్వహించారు. తర్వాత పంచామృతాలతోను, గంధోదకం, భస్మోదకం, బిల్వోదకం, పుష్పోదకం, మల్లికార్జున గుండంలోని పుణ్యజలాలతో సుబ్రహ్మణ్య స్వామికి శాస్త్రోక్తంగా అభిషేకం చేశారు. అలాగే హోమాలు నిర్వహించారు.

ధర్మమార్గాన్ని ఆచరించాలి

జూపాడుబంగ్లా: ధర్మమార్గం ఆచరించటమే మానవజన్మకు పరమార్థమని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ నూర్జహాన్, ఎంపీపీ సువర్ణమ్మ, ఏపీఎం అంబమ్మ తెలిపారు. సోమవారం జూపాడు బంగ్లా వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. కేక్‌కట్ చేసి, కొవ్వొత్తులు వెలగించి సంబారాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఫాదర్ స్టీఫెన్‌రాజు, ఏపీఓ గౌరీబాయి, ఎంఈఓ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ నాగన్న, ఈఓపీఆర్డీ మధుమోహన చక్రవర్తి, వెలుగు సీసీలు నాగన్న, గాంధీ, నాయక్, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్న అధికారులు వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది

2,223 ఎకరాల్లో భూ రీ సర్వే పూర్తి



హద్దు రాళ్లను ఏర్పాటు చేస్తున్న డీటీ, రెవెన్యూ సిబ్బంది

మహానంది: మండలంలోని బొల్లవరంలో జగనన్న భూ హక్కు- భూ రక్షలో భాగంగా 2,223.69 ఎకరాల్లో భూ రీసర్వే పనులు పూర్తయినట్లు సర్వే విభాగం డిప్యూటీ తహసీల్దార్ కామేశ్వరరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం బొల్లవరం గ్రామంలో రైతుల పంటపొలాలను హద్దులను సూచిస్తూ వైఎస్సార్ జగనన్న భూ సంరక్ష రాళ్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ చలమయ్య,గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆ విధులు అప్పగించొద్దు

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయులకు అంగన్‌వాడీల నిర్వహణ విధులు అప్పగించరాదని ఫ్యాప్టో నాయకులు కోరారు. సోమవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడీ గోపాల్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఫ్యాప్టో సెక్రెటరీ సుబ్బన్న, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు ఇస్తున్నామని, అంగన్‌వాడీల్లో విధుల నిర్వహణకు ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై వెళ్లాలని డీఈఓ మౌఖిక ఆదేశాలు జారీ చేయడం తగదన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, రామకృష్ణ, దస్తగిరి పాల్గొన్నారు. అలాగే.. అంగన్‌వాడీ సెంటర్ల బాధ్యత ఉపాధ్యాయులకు అప్పగించరాదని డీఈఓ కార్యాలయంలోని ఏడీ అనురాధకు పీఆర్టీయూ నంద్యాల జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, నాయకులు కృష్ణారావు, విజయరావు, సుమయూన్, ప్రేమ్‌కుమార్ వినతి పత్రం అందజేశారు.

విద్యుత్ పొదుపు- సామాజిక బాధ్యత

నంద్యాల(అర్బన్): విద్యుత్‌ను పొదుపుగా వాడటాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని నంద్యాల విద్యుత్ శాఖ డీ2 ఏఈ రా మయ్య కోరారు. విద్యుత్ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక టెక్కె మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు విద్యుత్ పొదుపుపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఏఈ సుబ్బారావు, 14వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ సోమశేఖర్‌రెడ్డి, హెచ్‌ఎం అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



చిన్నాను సత్కరిస్తున్న ఉపాధ్యాయ బృందం

పగిడ్యాల: జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఆంధ్ర ప్రదేశ్ జట్టుకు స్థానిక ఎస్సీ హస్టల్ విద్యార్థి పి.చిన్నా ఎంపికైనట్లు స్థానిక జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం మధుసూదన్‌రావు సోమవారం తెలిపారు. దేవమడ గ్రామానికి చెందిన విద్యార్థి స్థానిక హస్టల్‌లో ఉంటూ జెడ్పీ హైస్కూల్‌లో 10 తరగతి చదువుతున్నాడు.కబడ్డీ క్రీడలో రాణించే చిన్నా జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో ఎంఈఓ సుభాన్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఎంఈఓ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా ఆడుదాం.. ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహించేందుకు శ్రీకారం చుట్టారన్నారు. ఈనెల 26 నుంచి గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడలు ఉంటాయని, విజేతలకు ప్రశంసా పత్రాలను జారీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రషీద్‌మియ్య, రమణారావు, పీడీ కృష్ణ, క్రీడాశ్రీ పీతాంబరరెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఈ- కేవైసీ చేయించుకోండి

ఆత్మకూరు: డివిజన్ పరిధిలోని గ్యాస్ వినియోగదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలని గౌరీశంకర్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు గంగాధర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వినియోగదారులు ఈ- కేవైసీ ఫింగర్ ప్రింట్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. గ్యాస్ సబ్సిడీ పొందేందుకు ప్రతి ఒక్కరూ చేయించుకోవాలని సూచించారు.

విద్యుత్‌సబ్ స్టేషన్ వద్ద ధర్నా

ఆత్మకూరు: పట్టణంలోని విద్యుత్‌సబ్‌స్టేషన్ వద్ద సోమవారం బీజేపీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ మైనార్టీ కార్యవర్గ సభ్యురాలు షబానా, నంద్యాల బీజేపీ ప్రధాన కార్యదర్శులు సుంకన్న, అరవింద్‌రెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు తగ్గించాలని, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని కోరారు.

క్రీడలతో ఆరోగ్యం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం లభిస్తుందని సర్పంచు కలబండి మారెన్న అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎం.లింగాపురం గ్రామంలో క్రిస్టమస్ పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.20వేలు, రెండవ బహుమతి రూ.10వేలు ఇవ్వడం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు పుష్పరాజు, నాగరాజు, జయన్న తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి

ఆత్మకూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆత్మకూరు, నందికొట్కూరు డివిజన్లకు చెందిన అంగన్‌వాడీ వర్కర్స్ యునియన్ నాయకురాళ్లు మంజుల, లక్ష్మీదేవి, ప్రమీలమ్మ, శివలక్ష్మి, హరిత, మదార్‌బీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం , సహాయ కార్యదర్శి రామ్‌నాయక్ కోరారు. సోమవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద డివిజన్‌లోని అన్ని మండాలలకు చెందిన అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాములమ్మ, పద్మావతి, సుబ్బమ్మ, శివుడు, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చదువుకుంటేనే జ్ఞానం



సున్నిపెంటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రతి వ్యక్తి విద్యను అభ్యసించడం ద్వారానే జ్ఞానాన్ని పొందవచ్చని, ప్రతి ఒక్కరూ చదువుకోవాల్సిన అవసరం ఉందని ఎంఈఓ శుక్రూనాయక్ అన్నారు. బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి అనే కార్యక్రమంలో భాగంగా సోమవారం విజ్‌డమ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రిన్సిపల్ నక్కిళ్ల గాయత్రి ఆధ్వర్యంలో స్కూల్ నుంచి బస్టాండ్ ఆవరణ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈడు పిల్లలు పాఠశాలలో చదువుకోవాలని, పనులకు వెళ్లద్దని నినాదాలు చేశారు. ర్యాలీలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన ఉండాలి



దేవనూరులో డ్రోన్ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మిడుతూరు: ప్రతి ఒక్కరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన ఉండాలని ఈఓఆర్డీ ఫక్రుద్దీన్ అన్నారు. సోమవారం మండలపరిధిలోని చింతలపల్లి, దేవనూరు గ్రామాల్లో సర్పంచ్ ఓర్సు హరిత అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు వాటి ద్వారా లబ్ధి పొంది అభివృద్ధి పథంలోకి రావాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రభుత్వ పథకాలు, వ్యవసాయంలో డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ మెంబర్ మౌలా, సీహెచ్‌ఓ రంగస్వామి, సూపర్‌వైజర్లు రామతులశమ్మ, ఏసేపు, పంచాయతీ కార్యదర్శులు వీరారెడ్డి, వినయ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

భక్తిమార్గంలో నడవాలి

కొత్తపల్లి: ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో నడుచుకోవాలని రామదండు చిన్న స్వామి సీతారామంజనేయ అన్నారు. సోమవారం మండలంలోని జీ.వీరాపురం, గువ్వలకుంట్ల గ్రామాలలో రామదండు యాత్ర జరిగింది. ఆత్మకూరు మండలం కురుకుంద గ్రామం నుంచి వీరాపురం గ్రామానికి రామదండు యాత్ర చేరుకుంది. యాత్రలో భాగంగా పల్లకీలో సీతారాముల విగ్రహాలను కొలువుంచి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, యువతులు రథయాత్రకు ఘనస్వాతం పలికారు.



జీ.వీరాపురంలో రామదండు యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

ఆయన మాట్లాడుతూ లోకకల్యాణం కోసం ప్రతి 50, 60 సంవత్సరాలకు ఒకసారి రామదండు రథయాత్ర నిర్వహించడం జరుగుతోందన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ

మహానంది: మహానందిలో వెలసిన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర దంపతులకు సోమవారం రాత్రి పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. ఈఓ చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి పల్లకీలో కొలువు చేశారు. గణపతిపూజ, పుణ్యహవాచనం, అలంకార హారతులు నిర్వహించిన అనంతరం ఆలయ ప్రాకారాల్లో ఊరేగించారు. భక్తులు పల్లకీని మోస్తూ భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. పూజా కార్యక్రమాల్లో వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, భక్తులు పాల్గొన్నారు.



మహానందిలో పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం వినియోగదారుల క్లబ్, వాణిజ్య శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రిన్సిపాల్ శశికళ బహుమతులు అందజేశారు. అనంతరం జరిగిన వ్యాసరచన పోటీల్లో పాణ్యం, ఎర్రగుంట్ల, నందికొట్కూరు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఈనెల 24న కలెక్టర్ బహుమతులు అందజేస్తారని ప్రిన్సిపాల తెలిపారు. అలాగే తొలిస్థానంలో నిలిచిన వారు ఈనెల 22న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.